## క్లుప్తంగా

### సన్మానం



**చిట్యాల :** ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గిన్నారపు ఆదినారాయణకు కోల్‌కత్తాలోని భారతీయ భాషా పరిషత్, భారతీయ భాషా సమ్మాన్ యువ పురస్కారం-2025 అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా శనివారం అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. అలాగే తెలుగు భాషా పరిశోధన, సృజనాత్మక సాహిత్య రంగంలో కృషి చేసినందుకు గాను పురస్కారంతో పాటు ప్రశంస పత్రం, శాలువాతో సత్కరించారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, అంబేడ్కర్ వాదులు గుర్రపు రాజేందర్, గోల్కొండ సురేష్, పుల్ల అశోక్, వెల్పుల రాజ్‌కుమార్, భిక్షపతి, నరేష్, తిరుపతి, కిరణ్, రమేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం



**రేగొండ :** మండల కేంద్రానికి చెందిన మైస భద్రయ్య శనివారం మృతిచెందాడు. దీంతో 1982 బ్యాచ్‌కు చెందిన పోలీసులు భద్రయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి నారాయణ రెడ్డి, భిక్షపతి, సురేందర్, లక్ష్మీ నారాయణ, రఫాయిల్, కుమారస్వామి, జయరాజు పాల్గొన్నారు.

### విరాళం

**టేకుమట్ల :** మండలంలోని వెంకట్రావుపల్లి, కుమ్మరిపల్లె, జోదుపల్లె గ్రామాలకు చెందిన ఊరిపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యాక్రమానికి మండల కార్మికశాఖ అధ్యక్షుడు రామకృష్ణ ఆలయ నిర్వాహకులకు రూ.10,116లు అందజేశారు.

### నేడు స్వామి వారి జయంతి

**రేగొండ :** మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తిరు నక్షత్రం సందర్భంగా నేడు (ఆదివారం) స్వామి వారి జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ ముల్కనూరి భిక్షపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# సర్కారు బడి పిలుస్తోంది..



మొగుళ్లపల్లి: ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



అకినపల్లిలో బడిబాట కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయిలు

- జిల్లాలో 432 ప్రభుత్వ పాఠశాలలు
- బడిబాట ద్వారా విస్తృత ప్రచారం

**మొగుళ్లపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో మెరుగైన విద్యను అందించేందుకు పటిష్ఠ కార్యాచరణ చేపట్టింది. అన్ని రకాల వసతుల కల్పనకు పూనుకుంది. ఉపాధ్యాయులతో బడిబాట కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ బడుల్లో వసతులపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలల్లోనే చేరే విధంగా చూస్తున్నారు. పాఠశాల స్థాయిలోనే సాంకేతికతను జోడించి ఏఐ టెక్నాలజీతో విద్యా బోధన చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 319, ప్రాథమికోన్నత 44, ఉన్నత పాఠశాలలు 69 ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించాలా.. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలా అన్న సందిగ్ధంలో ఉన్నారు. అయితే విద్యార్థులను ఆకట్టుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం ప్రచారాలతో హోరెత్తిస్తున్నాయి. ఈ క్రమంలో సర్కారు బడిలో చేరాలని విద్యావేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

**ఇంగ్లిష్ మీడియంలో బోధన..**

సుశిక్షితులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తోంది. మారుతున్న బోధన, అభ్యసన విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం సెక్షన్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**క్రీడలకు ప్రాధాన్యం..**

ప్రైవేట్ స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా పరికరాలు ఉండటంతో విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యం సాధిస్తున్నారు.

**పరిశోధనలకు అవకాశం..**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశోధనల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. జాతీయ, సైన్స్ పరిశోధన అంశాలు ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ అవార్డుల పథకంలో పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున సాయం అందిస్తారు.

**మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లు..**

పేద విద్యార్థులు రోజు బడికి వచ్చేలా ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే బాధ తప్పింది. అలాగే 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లను అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. పాఠశాల నుంచి ఇంటికి మూడు కిలోమీటర్ల పైన దూరం ఉండి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోతే 6, 7, 8వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.250 చొప్పున ప్రభుత్వం రవాణాభత్యం చెల్లిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తుంది.

**నాణ్యమైన విద్యకు కృషి**



ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ సైతం అందించేందుకు ఇప్పటికే ఆయా పాఠశాలలకు తరలించాం. అలాగే ప్రాథమిక స్థాయిలో ఏఐతో విద్యాబోధన అందిస్తున్నాం. పాఠశాలల్లో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మొగుళ్లపల్లి, మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాంపులు కూడా ఏర్పాటు చేశాం.

- కుమారస్వామి, ఎంఈఓ, మొగుళ్లపల్లి

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**రేగొండ :** అర్హులందరికీ దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ అవినీతికి అస్కారం లేకుండా మంజూరు చేసినట్లు తెలిపారు.అనంతరం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి, నాగారం గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కొన్ని గంటల్లోనే శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా, వారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు నాయిని సంపత్‌రావు, సూదనబోయిన ఓంప్రకాష్, పున్నం రవి, గండి తిరుపతి, వీరబ్రహ్మం, వినోద్, అజయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**శిలాఫలకాల ధ్వంసం హేయమైన చర్య**

**భూపాలపల్లి రూరల్ :** ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అభివృద్ధిని అడ్డుకోలేరని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండిపడ్డారు. శనివారం రేగొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని, ఓర్వలేకనే భూపాలపల్లి మండలంలోని నాగారం, మోరంచపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల శిలాఫలకాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధ్వంసం చేశారని ఇది హేయమైన చర్య అని ఖండించారు. దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే పోలీసులను కోరారు.

**అభివృద్ధిని ఓర్వలేకనే..**



ధ్వంసం చేసిన శిలాఫలకం

నియోజక వర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే శిలాఫలకాలను ధ్వంసం చేయడం పిరికి పంద చర్య అని పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు చాడ రఘునాథరెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో మోరంచపల్లిలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, గ్రామంలో నీటిముంపునకు గురైన పట్టించుకోలేదన్నారు.

# ఈద్గా ఏర్పాటుకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మతపెద్దలు

**కాటారం :** మండలంలోని ఇబ్రహీంపల్లిలో ఈద్గా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రిశ్రీధర్‌బాబు కృషి చేయాలని ముస్లిం మతపెద్దలు కోరారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఇబ్రహీంపల్లిలో ఈద్గా లేకపోవడంతో రంజాన్, బక్రీద్ పండుగల ప్రత్యేక ప్రార్థనలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. వర్షాకాలం, ఎండాకాలం ప్రత్యేక ప్రార్థనలకు అంతరాయం ఏర్పడుతుందని అన్ని హంగులతో కూడిన ఈద్గా ఏర్పాటుకు మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో మతపెద్దలు సాదిక్, చాంద్, మునీర్, నజీర్, షఫి, కలిమ్, సాబీర్, మహిముద్, నయీం, అంజద్, పాల్గొన్నారు.

### రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

**ఎస్ఎస్‌తాడ్వాయి :** మంత్రి సీతక్క ఆదేశాలతో రాహుల్ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న (సోమవారం) మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తారని అన్నారు. పరీక్షలు చేయించుకునే వారు ఆధార్, ఓటర్, రేషన్ కార్డు జిరాక్స్‌లతోపాటు ఫోన్ నంబర్ తీసుకుని రావాలన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### దుస్తులు, పుస్తకాల పంపిణీ



**వాజేడు :** విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న దుస్తులు, పుస్తకాలను ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం అంజేశారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు వాటిని ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు 75 శాతం మేర పాఠశాలలకు పుస్తకాలు, దుస్తులు చేరిపట్లు ఎంఈఓ వివరించారు.

# 'ఇళ్ల పంపిణీలో ఆరోపణలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

**ఎస్ఎస్‌తాడ్వాయి :** ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతోపాటు ఐటీడీఏ ద్వారా అదనంగా 1,500 ఇళ్లను పంపిణీ చేసిన ఘనత మంత్రి సీతక్కకే దక్కుతుందన్నారు. సీతక్క కీర్తిని, పేరును ఓర్వలేని నాయకులు కుటీల రాజకీయాలు చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు లేదన్న సోయి ఆ పార్టీ నాయకులకు ఎందుకు లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మంత్రి సీతక్కపై, పార్టీపై ఉన్న అక్కసుతో కావాలని ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మేడారం జాతర మాజీ చైర్మన్ లచ్చుపటేల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజఫర్ హుసేన్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు జగదీశ్, బండారి చంద్రయ్య, జయపాల్‌రెడ్డి, గౌని మధు పాల్గొన్నారు.

# చేతిపంపునకు మరమ్మతు చేయండి



చేతిపంపును పరిశీలిస్తున్న చిరంజీవి

**ఎస్ఎస్‌తాడ్వాయి :** జలగలంచ గొత్తికోయగూడెం సమీపంలోని జాతీయ రహదారి పక్కన బస్టాండ్ వద్ద ఉన్న చేతిపంపునకు మరమ్మతు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి అధికారులను కోరారు. సోమవారం స్థానికులతో కలిసి ఆయన చేతిపంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిపంపు పనిచేయక నెలరోజులు గడుస్తున్న అధికారులు మరమ్మతులు చేయడం లేదన్నారు. తాగునీటి కోసం గూడెంలోని గొత్తికోయలతోపాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చేతిపంపును మరమ్మతు చేయాలని కోరారు.

టేకుమట్ల: సందేశం ఇస్తున్న మతపెద్ద





కాటారం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

### ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

**కాటారం :** మద్యానికి బానిసైన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అంకుషాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఇనుగాల భాస్కర్(33) అతిగా తాగుతూ మద్యానికి బానిసయ్యాడు. సమయానికి తినకపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురై పలుమార్లు ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికి మార్పు రాలేదు. కాగా భాస్కర్ శనివారం ఉదయం మద్యం తాగి వచ్చి తల్లి సమ్మక్కతో భోజనం విషయంలో గొడవపడి కొట్టడానికి రావడంతో తల్లి భయంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. దీంతో మద్యం మత్తులో క్షణికావేశానికి గురైన భాస్కర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి తల్లి సమ్మక్కకు సమాచారం అందించడంతో ఇంటికి వచ్చి చూసేసరికి భాస్కర్ కొన ఊపిరితో ఉన్నాడు. చుట్టు పక్కల వారు భాస్కర్‌ను కిందికి దించి చికిత్సకు తరలించే లోపు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

# 'జర్నలిస్టులను విస్మరిస్తున్న పాలకులు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రం స్వామి

**మంగపేట :** ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న అసంఘటిత కార్మికులైన జర్నలిస్టులను ప్రభుత్వాలు, పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారని సీనియర్ జర్నలిస్టుల సంఘం గౌరవ అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు ధర్మపురి శ్రీనివాస్, ఎర్రం స్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పాత్రికేయుల సమస్యలపై అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామి మాట్లాడారు. ప్రభుత్వాలు అధికారంలోకి రావడానికి, పాలకులు వారి పదవులకు విలేకరులను పావులుగా వాడుకుంటున్నారే తప్ప సమాజహితం కోసం పనిచేస్తున్న పాత్రికేయుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 25ఏళ్ల నుంచి ఇంటి స్థలాలకోసం పాలక ప్రభుత్వాల ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టు తిరుగుతూ వినతిపత్రాలు అందజేసినా హామీలు తప్ప ఆచరణలో చూపిందేమి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పాత్రికేయులందరికి ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి నేడు మొండిచేయి చూపిందని విమర్శించారు. మంత్రి సీతక్క మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు పలుమార్లు ఇంటి స్థలాల విషయంపై మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామానికి నాలుగో స్తంభం అని పిలవబడే విలేకరులకు ప్రభుత్వాలు, పాలకులు ఇచ్చే గుర్తింపు ఇదేనా అన్ని ప్రశ్నించారు. జర్నలిస్టుల సేవలను వినియోగించుకుంటూ వారిని విస్మరిస్తున్న రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధుల మాటలను ఇకపై నమ్మబోయేది లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇంటిస్థలాలు, ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తక్షణం అందేలా ప్రభుత్వం, పాలకులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ శ్రీనివాస్, సభ్యులు కల్లెబోయిన శ్రీనివాస్, మఠం రమేష్, కురిమిళ్ల శ్యామ్, నల్లూరు మాధవ్, వడ్లకొండ వీరయ్య, పల్లాపు రమేష్, ఇప్పాల నరేష్, ఈసంపెల్లి సురేందర్, పొలసాని శ్రీనివాస్‌రెడ్డి, ఉగ్గుమళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్



రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని జంషెడ్‌బేగ్‌పేట దర్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



మొగుళ్లపల్లి: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిట్యాల: ముస్లింలను ఆలింగనం చేసుకుంటున్న సీఐ మల్లేష్



మొగుళ్లపల్లిలో..



టేకుమట్ల: వెలిశాలలో ముస్లింలకు స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చిట్యాల :** త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అని సీఐ మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మజీద్ ఏ కౌసర్ ఈద్గా మైదానంలో నిర్వహించిన బక్రీద్ పర్వదిన వేడుకల్లో సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగానికి, సహనానికి బక్రీద్ ప్రతీకగా నిలుస్తోందన్నారు. ముస్లింలు ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ రాజ్‌మహ్మద్, మజీద్ కమిటీ అధ్యక్షుడు అజ్మత్‌మియా, కార్యదర్శి హైదర్ పాషా, వైస్ ప్రెసిడెంట్ షఫీ పాషా, జాయింట్ సెక్రటరీ అక్బర్, కోశాధికారి హుస్సేన్, కమిటీ సభ్యులు అంకూస్, శంషొద్దీన్, జలీల్, ఉమాఫ్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

**మొగుళ్లపల్లిలో..**

**మొగుళ్లపల్లి :** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను వేడుకగా జరుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రజాసాహెబ్, అబ్బు, మాజార్, తాజ్, కలీల్, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

**మల్హర్‌లో..**

**మల్హర్ :** మండలంలోని తాడిచర్ల, కొయ్యూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ త్యాగానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

**టేకుమట్ల :** మండలంలోని వెలిశాలతో పాటు ఆయా గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను శనివారం జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బండి రవీందర్, దొంతుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎండీ కమరుద్దీన్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపల్లి వీరేశం, ముస్లింలు పాల్గొన్నారు.

**కాటారం :** కాటారం, మహాముత్తారం మండలాల్లో ముస్లింలు శనివారం బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. స్థానిక మజీద్, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ నాయకులు ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. పండుగలు కులమతాల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పలువురుపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**రేగొండ :** రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పలు గ్రామాలలో బక్రీద్ వేడులకను ముస్లింలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.

### భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు

**మల్హర్ :** మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ, నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వ నుంచి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. పెద్దతూండ్ల పంచాయతీ పరిధిలోని కిషన్‌రావుపల్లిలో అంగన్‌వాడీ భవనానికి రూ.12లక్షలు, గాదంపల్లిలో అంగన్‌వాడీ భవనానికి రూ.12 లక్షలు, పెద్దతూండ్ల (అడ్వాలపల్లి)అంగన్‌వాడీ-2 భవనానికి రూ.12లక్షలు, వల్లెంకుంటలో అంగన్‌వాడీ భవనానికి రూ.12 లక్షలు, మల్లంపల్లి అంగన్‌వాడీ భవనానికి రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అలాగే కొయ్యూరు గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు, మల్లంపల్లి పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయి. నూతన భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు చేయించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మండల ప్రజల తరఫున మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.